బస్తీల్లో మౌలిక సదుపాయాలు

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 13: అడిక్‌మెట్ డివిజన్ బాపూజీ నగర్‌లో రూ.3లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీల్లో మౌలిక సదుపాలు కల్పించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధిక నిధులు వెచ్చించి పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి పెండింగ్‌లో ఉన్న లలితానగర్, ఆదర్శనగర్ డ్రైనేజీ సమస్యలను శాశ్వత ప్రతిపాదిక పర్కిష్కరించినట్టు వెల్లడించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరింస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జల మండలి మేనేజర్ శివ, బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, వి.సుధాకర్‌గుప్త, బి.శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, మాధవ్, బొట్టు శ్రీనివాస్, నేత శ్రీనివాస్, సయ్యద్ అస్లాం, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, సురేందర్, రవి యాదవ్, యూనుస్, శ్రీధర్‌రెడ్డి, బల్లా ప్రశాంత్, బస్తీవాసులు మహేశ్వర్‌రెడ్డి, మాణిక్, నర్సింగ్‌రావు, రమేశ్, మహేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


బాపూజీనగర్‌లో పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎంబీఏ (టీఎం), ఎంబీఏ (ఈవినింగ్) ప్రవేశాల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు గడువును పొడిగించినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని, పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. తమ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిగా నింపి, రూ.500 అపరాధ రుసుముతో సహా నియమిత రుసుమును ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పరీక్షను ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. పై రెండు కోర్సులూ ఈవినింగ్ కోర్సులేనని చెప్పారు. ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లని పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్-2024లో అర్హత సాధించిన వారు పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, వారు దరఖాస్తు సమర్పించి, నేరుగా కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని వివరించారు. ఈ రెండు కోర్సులకూ డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లు ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉండడం తప్పనిసరి అని చెప్పారు.

ఎంపీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 18వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఓయూలో మరిన్ని సంస్కరణలు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: త్వరలో ఓయూలో మరిన్ని సంస్కరణలు ప్రవేశపెట్టనున్నట్టు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ తెలిపారు. వచ్చే నెల 1నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇటీవల ఓయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎం.కుమార్ తొలిసారిగా ఓయూ అధ్యాపకులతో సమావేశమయ్యారు. పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఓయూ ఖ్యాతిని నిలబెట్టేలా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రతిష్టాత్మక వర్సిటీకి వీసీగా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాక్ గుర్తింపు కోసం అసవరమైన సమాచారాన్ని తక్షణమే ఐక్యూఏసీకి అందజేయాలని అధ్యాపకులకు సూచించారు. తరగతి గది బోధనే తన మొదటి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రతి అధ్యాపకుడు నిర్ణీత సమయం బోధనకు కేటాయించాలన్నారు. జీతం, జీవితాన్నిచ్చిన వర్సిటీకి జవాబుదారీగా ఉండాలని అన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా అధ్యాపకులు హాజరును నమోదు చేసుకోవాలన్నారు. పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియాలో అనసవరపు సంచలనాల జోలికి పోకుండా సమస్యల పరిష్కారం దిశగా ఆవిష్కరణలు సంచలనంగా మారాలని ఆకాంక్షించారు. అప్పుడే సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. ఓయూలో పాలన పూర్తిగా ఆన్‌లైన్ చేస్తున్నట్టు, ధ్రువపత్రాలన్నీ ఆన్‌లైన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. పరిపాలన, విద్య, పరిశోధనలు సహా అన్నిట్లోనూ ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రపంచం మెచ్చే ఆవిష్కరణలు జరగాలని, ఇందుకు ప్రతి అధ్యాపకుడు వ్యక్తిగత క్రమశిక్షణతో పని చేయాలని విజ్ఞప్తి చేశారు. వేగంగా మారుతున్న ఆధునిక ప్రపంచంలో పోటీని తట్టుకునేలా నైపుణ్యాభివృద్ధి జరగాలని, ఇందుకు కొత్తతరం విద్యావిధానాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కోరారు. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్‌లో వెయ్యి లోపు ర్యాంక్ సాధించే దిశగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, వివిధ విభాగాల హెడ్‌లు, బీవోఎస్ చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

కాళోజీ నారాయణరావు వర్ధంతి

కాళోజీ నారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ

చిక్కడపల్లి, నవంబర్ 13: చిక్కడపల్లి నగర గ్రంథాయలంలో సంస్థలో బుధవారం కాళోజీ నారాయణరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లెబ్రరీ గ్రేడ్-2 గ్రంథ పాలకురాలు ప్రతిభారెడ్డి, నగర గ్రంథాలయ సంస్థ సిబ్బంది. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కొండాపూర్: వివాహిత అదృశ్యమైన ఘటన చందానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన లేబర్ ఎరుకుల శ్రీను భార్య ఎరుకుల అంకితతో కలిసి శివాజీనగర్‌లో ఉంటూ పనులు చేస్తుంటాడు. ఈ నెల 11న శ్రీను పనులకు వెళ్లగా.. అంకిత ఇంట్లో ఉన్నది. తిరిగి ఇంటికి వచ్చే సరికి అంకిత కనిపించక పోవడంతో పనిచేస్తున్న చోట, తెలిసిన వారిని, బంధువులను ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. కాగా.. అంకిత తరచుగా గుర్తు తెలియని నంబర్‌కు మెసెజ్ చేయడం, మాట్లాడడం చేస్తుండేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలగిరి కేవీలో ముగిసిన ఏక్తా పర్వ్

కలకత్తా కేవీ విద్యార్థులకు మెదటి బహుమతి ట్రోఫిని అందజేస్తున్న బ్రిగేడియర్ ప్రశాంత్

బొల్లారం, నవంబర్ 13: సంస్కృతుల్లో ఐక్యతను పెంపొందిచాలని బ్రిగేడియర్ ప్రశాంత్ హల్గేరి (హెచ్‌క్యూ టాసా సికింద్రాబాద్ డైరెక్టర్ ఎడ్యుకేషన్)అన్నారు. తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో జరిగిన మూడు రోజుల జాతీయ ఏక్తా పర్వ్ వేడుకలు బుధవారం ముగిశాయి. ఏక్ భారత్-శ్రేష్ట భారత్ అనే నినాదంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. పెయింటింగ్, కళాఖండాల అద్భుతమైన ప్రదర్శనలు చేపట్టి, మొదటి బహుమతి సాధించిన కలకత్తా కేంద్రీయ విద్యార్థులను, ద్వితీయ బహుమతి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో టి.ప్రభుదాస్ కేవీఎస్ ప్రాంతీయ కార్యాలయం హైదారాబాద్ అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేయండి

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, నవంబర్ 13: పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు ఆమె అధికారులతో కలిసి దూద్‌బావి రైల్వే బ్రిడ్జి వద్ద జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాసూరి సునీత మాట్లాడుతూ వాల్ నిర్మాణం వల్ల వరద నీటి ప్రవాహానికి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా అమ్మవారి ఆలయ ఏర్పాటును స్థానికుల అభిమతాలకు అనుగుణంగా చేపట్టాలని ఆమె తెలిపారు. రైల్వే ప్రాజెక్ట్ అధికారులు సైతం సదరు పనుల నిర్వాహణకు అనుకూలంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి


పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, నవంబర్ 13: ప్రజా సమస్యల పరిష్కరానికి అన్నివిధాలుగా కృషి చేస్తున్నట్టు అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ నుంచి సుభాష్ విగ్రహం వరకు మంచినీటి పైపులైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ దశలవారీగా పెండింగ్ పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం విద్యాసాగర్, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, కైరంకొండ యాదగిరి, సత్తయ్యగౌడ్, ఎల్లయ్య, దేవయ్య, రామప్పచారి, మల్లేశ్, వసంత తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్‌గా చెన్నప్ప

ప్రొఫెసర్ చెన్నప్పను అభినందిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ చెన్నప్ప నియమితులయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగానికి చెందిన ఆయన ప్రస్తుతం ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన గతంలో కామర్స్ విభాగం హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఓయూ చీఫ్ వార్డెన్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్, సికింద్రాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేన అనంతరం అభినందించారు.

సామాజిక సేవలో ఆర్యవైశ్య సంఘం

బన్సీలాల్‌పేట్, నవంబర్ 13: నామాలగుండు ఆర్యవైశ్య సంఘం, వీబీజీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో కార్తిక మాసం ద్వాదశి సందర్భంగా గాంధీ దవాఖాన వద్ద బుధవారం పేదలకు అన్నదానం చేశారు. వీబీజీఎఫ్ తరపున బండారు సుబ్బారావు తన జన్మదినం పురస్కరించుకొని ముగ్గురు పేద మహిళలకు స్వయం ఉపాధి కోసం ఉచితంగా కుట్టు మిషన్లను అందజేశారు. ముఖ్య అతిథిగా వీబీజీ రాజన్న, సంఘం అధ్యక్షుడు టి.విశ్వేశ్వరరావు, విశ్వజ్యోతి, సభ్యులు హాజరయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 13: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ ఫీవర్ ఆసుపత్రి, బసంతకాలనీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా గురువారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంట వరకు ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పధిలోని అంజయ్య క్వార్టర్స్, ఫీవర్ ఆసుపత్రి, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బసంత్‌కాలనీ ఫీవర్ పరిధిలోని లింగంపల్లి, బసంతకాలనీ, వైశ్య హాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ ఎక్స్‌రోడ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

పహిల్వాన్ విజయ్‌కుమార్‌కు బంగారు పతకం

అమీర్‌పేట్, నవంబర్ 13: నగరంలోని సుల్తాన్ షాహీ జీహెచ్ఎంసీ మైదానంలో జరుగుతున్న కుస్తీ పోటీల్లో భాగంగా జరిగిన సీనియర్ స్టేట్ చాంపియన్‌షిప్‌ను బల్కంపేట శ్రీ వీర హనుమాన్ వ్యాయామశాలకు చెందిన పహిల్వాన్ విజయ్‌కుమార్ 97 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. ఈ విభాగంలో యోధానయోధులు తలపడగా, విజయ్‌కుమార్ పహిల్వాన్ అందరిని మట్టి కరిపించి బంగారు పతకాన్ని సాధించడం ఆనందంగా ఉందని, ఆయన కఠోర శ్రమతోనే ఈ గెలుపు సాధ్యమైందని, వ్యాయామశాల నిర్వాహకులు, కుస్తీ పోటీల శిక్షకులు బత్తుల రాజేశ్ (రాజు పహిల్వాన్) విజేత విజయ్‌కుమార్‌ను అభినందించారు. పోటీల్లో ఇతర విభాగాల్లో ఈ వ్యాయామశాల మరో ముగ్గురు క్యాంప పతకాలు సాధించడం విశేషమని చెప్పారు.

పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మాట్లాడుతున్న కనకం కొమురెల్లి

చిక్కడపల్లి, నవంబర్ 13: తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ నియామకం జరిగింది. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఎస్.లక్ష్మారెడ్డి ప్రకటరించారు. అధ్యక్షుడిగా కనకం కొమురెల్లి, ప్రధాన కార్యదర్శిగా టి.అశోక్‌రెడ్డి, టీఏఎస్ఆర్ గుప్తా, కార్యనిర్వాహణాధికారి జి.సూర్యకళ, కోశాధికారి జయంత్ ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్‌స్వామి, ఎం.స్వామకుమారి, జయసేన్‌కరెడ్డి, కె.లక్ష్మణ్‌రావు, సంయుక్త కార్యదర్శి కె.జానకి, ఝాన్సీ లక్ష్మిబాయి, జి.యాదగిరి, డి.పవన్‌కుమార్ నియమితులయ్యారు. అధ్యక్షుడు మాట్లాడుతూ టీఎస్ జీఓఎస్ గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీ సభ్యులమైన తమకు 2008లో రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లి గ్రామం సర్వే నం.36, 37లో 189 ఎకరాలు అప్పటి ప్రభుత్వం కేటాయించిదన్నారు. లాటరీలో ప్లాట్లు దక్కని కొంతమంది హైకోర్టులో కేసులు వేశారని తెలిపారు. దీంతో లాటరీ ద్వారా ప్లాట్లు పొందిన సభ్యులు ఇండ్లు నిర్మించుకోలేదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడంతో మాకు న్యాయం జరుగుతుందని భావించినా ఇప్పటి వరకు జరగలేదన్నారు. ఈ విషయమ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా తమ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్య పరిష్కరించాలని డిమండ్ చేశారు.

యువతకు మెడికల్ కోడింగ్ శిక్షణ

అడ్డగుట్ట, నవంబర్ 13: అప్సా టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నాలుగు నెలల పాటు శిక్షణను అందిస్తున్నట్టు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం గోపి బుధవారం తెలిపారు. 20-27 ఏండ్ల వయస్సు గల బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకామ్, ఎమ్‌కామ్ విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో(మెడికల్ టెర్మినాలజీ, హ్యూమన్ అనాటమి, పిసియాలజీ, ఐసీడీ-10, సీపీటీ, హెచ్‌సీపీఎస్, ఆర్వీఎం) బేసిక్ బిల్లింగ్ టెర్మినాలజీ, ఎమ్మెస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, ఇంగ్లిష్ టైపింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు నవంబర్ 15న ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. 93913 36484, 91549 90130, 91549 90131లో సంప్రదించాలన్నారు.

గాయపడిన హోంగార్డుకు అండగా

సొమ్మును హోంగార్డు రాజుకు అందజేస్తున్న సీఐ శ్రీనివాసులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: గాయపడిన హోంగార్డుకు చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు అండగా నిలిచారు. సుమారు నెలన్నర క్రితం చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హోంగార్డు కోటం రాజు విద్యానగర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కుడి కాలు విరగగా వైద్య ఖర్చులకోసం స్టేషన్ సిబ్బంది కలిసి రూ.41,700 మొత్తాన్ని పోగు చేశారు. ఈ మొత్తాన్ని రాజుకు సీఐ సీహెచ్ శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు.

రైల్వే సేవ చేయడమంటే.. దేశ సేవే

అడ్డగుట్ట, నవంబర్ 13: సరిహద్దుల్లో సైనికుల దేశ సేవ, నిత్యం రైల్వేల్లో ప్రయాణించే లక్షలాది మంది ప్రజలకు రక్షణ కల్పిస్తున్న ఆర్పీఫ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బుధవారం చిలకలగూడలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైల్వేకు సేవ చేయడం, దేశానికి సేవ చేయడం ఒక్కటేనని అన్నారు. తాను కూడా ఆర్పీఫ్ ఉద్యోగి కుటుంబానికి చెందిన వాడినేనని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆర్పీఫ్ ఉద్యోగుల సమస్యలపై తాను పోరాడుతానని, ఢిల్లీ వెళ్లి రాహుల్‌గాంధీతో సమస్యలపై చర్చిస్తానని ఆయన తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

అలరించిన సుశీల-ఘంటసాల సినీ సంగీత విభావరి

ముషీరాబాద్, నవంబర్ 13: అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయని పి.సుశీల జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సుశీల-ఘంటసాల సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయనీ, గాయకులు అర్చన వెంకటేశ్వరావు, లలిత, అఖిల తదితరులు ఆలపించిన మధురగీతాలు అలరించాయి. కార్యక్రమంలో సాహితీవేత్త వోలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించారు. గాయకుడు సీహెచ్ త్రినాథరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిన్నెర రఘురాం, రవీందర్‌రెడ్డి, ఎన్.రవికుమార్, డీఎస్ఎన్ మూర్తి, అమంత తదితరులు పాల్గొన్నారు.